నేటి నుంచి ఆషాఢమాస మహోత్సవాలు

మన్సూరాబాద్‌: నాగోలు డివిజన్‌ పరిధి శ్రీసాయినగర్‌ కాలనీలోని శ్రీదుర్గాదేవి ఆలయంలో శుక్రవారం నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు ఆషాఢ మాస మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్‌ పోచబోయిన గణేష్‌ యాదవ్‌ తెలిపారు. ఈ సందర్భంగా దుర్గాదేవికి ప్రతి శుక్రవారం ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనమిస్తారని పేర్కొన్నారు. 12వ తేదీ శుక్రవారం నింబశౌకమాల అలంకరణ (వేప ఆకుమాలలతో), 19న శాకాంబరీదేవి అలంకరణ (కూరగాయల మాలలతో), 26న బింబిర ఫలమాల అలంకరణ (నిమ్మకాయల మాలలతో), వచ్చే నెల 2న హరిద్రఖాండ మాల అలంకరణ (పసుపు కొమ్ముల మాలలతో) అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. ఈ నెల17న తొలి ఏకాదశి సందర్భంగా విష్ణుమూర్తికి పంచామృత ఫలరసాభిషేకము, అదేవిధంగా 26న పోచమ్మదేవికి పట్టువస్త్రాల సమర్పణ, ఫలహార బండి ఊరేగింపును ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

త్వరలో దివ్యాంగులకు తీపి కబురు

వికలాంగుల సహకార సంస్థ చైర్మన్‌ ఎం.వీరయ్య



చాదర్‌ఘాట్‌: ఎన్నో రోజుల నుంచి ఎదురు చూస్తున్న విద్యాసంస్థల్లో రిజర్వేషన్లపై దివ్యాంగులకు త్వరలో తీపికబురు వస్తుందని రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్‌ ముత్తినేని వీరయ్య తెలిపారు. గురువారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వారం రోజులలో ఉన్నత విద్యలో రిజర్వేషన్, వయో పరిమితిలో ఐదు ఏండ్లు సడలింపు జీఓ జారీ కాబోతుందని అన్నారు. ఈ జీఓలపై రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు చేస్తూ ముఖ్యమంత్రికి అభినందన సభలు నిర్వహిస్తామని తెలిపారు.

అనాథ విద్యార్థులకు రూ.1.25 లక్షల స్కాలర్‌షిప్‌లు



దిల్‌సుఖ్‌నగర్‌: తెలంగాణ రాష్ట్రంలో చైల్డ్‌ కేర్‌ కేంద్రాల్లో చదువుతున్న విద్యార్థులలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఐదుగురు అనాథ విద్యార్థులు బెంగళూరుకు చెందిన గార్డియన్స్‌ ఆఫ్‌ డ్రీమ్స్‌ సంస్థ నుంచి ఒక్కొక్కరికి రూ. 25,000 చొప్పున మొత్తం రూ. 1 లక్ష 25 వేల రూపాయలు అవార్డుగా పొందారు. గార్డియన్స్‌ ఆఫ్‌ డ్రీమ్స్‌ సంస్థకు చెందిన ప్రోగ్రామ్‌ లీడర్‌ (హైదరాబాద్, కలకత్తా, బాంబే) మిస్‌ ప్రియాంక సింగ్‌ ఎల్‌బీనగర్‌ చిత్రలేవుట్‌ కాలనీలో అనాథ విద్యార్థి గృహాన్ని సందర్శించి స్కాలర్‌షిప్‌ అవార్డులను ఇంటర్మీడియట్‌లో ఎస్‌. శివ- 97 శాతం, పి. వంశీ- 84 శాతం, పి.సాయి కిరణ్‌ - 83 శాతం, ఎస్‌ఎస్‌సిలో జి. కార్తిక్‌ - 95 శాతం, డి. గణేష్‌- 87శాతం పొందిన విద్యార్థులకు నగదు అవార్డు ఆర్డర్స్‌ను అధ్యక్షులు మార్గం రాజేష్‌ సమక్షంలో అందచేశారు. ఈ సందర్భంగా ప్రియాంక సింగ్‌ మాట్లాడుతూ అనాథ విద్యార్థి గృహం ఒక అద్భుత గృహం అని విద్యార్థులకు గృహం అమ్మా, నాన్న అన్నీ తానై, విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. వచ్చే విద్యా సంవత్సరం కూడా అనాథ విద్యార్థి గృహ మెరిట్‌ విద్యార్థులకు అవకాశం ఇస్తామని ప్రకటించారు.

మౌలిక వసతులు కల్పించాలి

నాగోలు: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌ టీచర్లను ఉండేలా చూడాలని ఎమ్మార్పీఎస్‌ రంగారెడ్డి జిల్లా వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ మేముగంటి సంపత్‌ ఉప్పల్‌ మండల విద్యాశాఖ అధికారి గూడల శశిధర్‌ కోరారు. గురువారం ఎమ్మార్పీఎస్‌ ఆధ్వర్యంలో ఉప్పల్‌ మండల విద్యాశాఖ అధికారి శశిధర్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంపత్‌ మాట్లాడుతూ ప్రైవేటు స్కూల్లో జరుగుతున్న ఫీజు దోపిడీలను అరికట్టాలి కోరారు. ప్రైవేట్‌ పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి పుస్తకాల పేరుతో, యూనిఫాంల పేరుతో పెద్ద ఎత్తున్న ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. ప్రైవేట్‌ పాఠశాల ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్‌ ఎల్‌బీనగర్‌ అధ్యక్షులు ఉపేందర్, బండారి రవికుమార్‌ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కండి

హస్తినాపురం: డివిజన్‌ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని ప్రజల భాగస్వామ్యంతో పనులు త్వరితగతిన పూర్తికావడమే కాకుండా పనులలో నాణ్యతా ప్రమాణాలు మెరుగుపడతాయని హస్తినాపురం డివిజన్‌ కార్పొరేటర్‌ బానోతు సుజాతనాయక్‌ అన్నారు. గురువారం హస్తినాపురం డివిజన్‌ పరిధిలోని హనుమాన్‌నగర్‌ కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను అధికారులతో కలసి కార్పొరేటర్‌ సుజాతనాయక్‌ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈ హేమూనాయక్, హనుమాన్‌నగర్‌ కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, గంధం శ్రీనివాస్, షాకీర్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మమత, మల్లేశ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు చైన్‌ స్నాచర్ల అరెస్టు

నాగోలు: మహిళ మెడలోని బంగారు గొలుసు చోరీ చేసిన ఇద్దరు వ్యక్తులను నాగోలు పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌ తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాజస్థాన్, జటావ్ర హిండౌన్, నహరియాకపూర్‌ గ్రామానికి చెందిన గులాబ్‌సింగ్‌ గుర్జార్‌ వృత్తి రీత్యా గ్రానైట్‌ పనులు చేస్తుంటాడు. రాజస్థాన్, భరత్‌పూర్‌ బయానాకు చెందిన ఆమెత్‌ గుజ్జర్‌ (30) ఇతడు కూడా గ్రానైట్‌ పనులు చేస్తున్నాడు. గులాబ్‌సింగ్‌ గుర్జార్, అమెత్‌ గుజ్జర్‌ స్నేహితులు. జల్సాలకు అలవాటు పడిన వీరు దొంగతనాలు చేయడం ప్రారంభించారు. ఈనెల 7వ తేదీన నాగోలు లక్ష్మీనర్సింహ కాలనీలో ఇంటి ముందు నిల్చున్న మహిళ సుక్కమ్మ మెడలోని 3 తులాల బంగారు గొలుసును వీరు ద్విచక్ర వాహనంపై వచ్చి స్నాచింగ్‌ చేసుకుని పారిపోయారు. సుక్కమ్మ ఫిర్యాదు మేరకు నాగోలు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం బండ్లగూడ చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తుండగా గులాబ్‌ సింగ్‌ గుర్జార్, ఆమెత్‌ గుజ్జర్‌లు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా లక్ష్మీనర్సింహ కాలనీలో చైన్‌ స్నాచింగ్‌కు పాల్పడిన విషయాన్ని చెప్పారు. ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి

మలక్‌పేట: పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు దాడి చేసిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌ తెలిపిన వివరాల ప్రకారం... సరూర్‌నగర్‌కు చెందిన రమేష్‌ ఆస్మాన్‌ఘడ్‌ వెంకటాద్రినగర్‌లో అపార్ట్‌మెంట్‌ ఫ్లాట్‌ తీసుకొని అందులో పేకాట నడిపిస్తున్నాడు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు గురువారం రాత్రి ఆ స్థావరంపై దాడి చేశారు. నిర్వాహకుడు రమేష్‌తో సహా 10 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ. ఒక లక్ష మూడు వేల నగదు, 11 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్లాస్టిక్‌ భూతం!

పర్యావరణానికి పెనుముప్పు

- అధికారుల తనిఖీలు.. ఆ తరువాత షరా మామూలు!
- ప్రజలను అనారోగ్యానికి గురిచేస్తున్న ప్లాస్టిక్‌ వాడకం
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- యథేచ్ఛగా ప్లాస్టిక్‌ కవర్ల అమ్మకాలు



దిల్‌సుఖ్‌నగర్‌: పర్యావరణానికి ప్లాస్టిక్‌ అతి ప్రమాదకరంగా మారుతోంది. ప్లాస్టిక్‌ వల్ల కలిగే దుష్పరిణాలను గుర్తించి పలు సందర్భాల్లో న్యాయస్థానం, జీహెచ్‌ఎంసీ అధికారులు దుఖాణాలు, వ్యాపార సంస్థలకు హెచ్చరికలు జారీ చేసినా అవి కొన్ని రోజులకే మాత్రమే పరిమితమవుతున్నాయి. అధికారులు తనిఖీలు చేసిన సందర్భాల్లో కొన్ని రోజులు పాలిథిన్‌ బ్యాగులను వాడి ఆ తరువాత అంతా షరా మామూలే అన్నట్లు విచ్చలవిడిగా ప్లాస్టిక్‌ కవర్లను వాడుతున్నారు. దీంతో ఎక్కడ చూసినా దుకాణాలు, షాపింగ్‌మాల్స్‌ నిర్వాహకులతోపాటు ఇతర వ్యాపారస్తులు వస్తువులను ప్యాక్‌ చేయడానికి ఎక్కువగా ప్లాస్టిక్‌ కవర్లకే ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో దుకాణానికి వెళ్లి ఏ చిన్న వస్తువు తీసుకున్నా ప్లాస్టిక్‌ క్యారీ బ్యాగ్‌లు తప్పనిసరిగా మారింది.

- మలక్‌పేట్‌జోన్‌ పరిధిలోని చిన్న దుకాణాల నుంచి పెద్దపెద్ద మాల్స్‌లలో ప్లాస్టిక్‌ క్యారీ బ్యాగ్‌లను విచ్చలవిడిగా వాడుతున్నారు. పర్యావరణానికి, ప్రజారోగ్యానికి హాని కలిగించే ప్లాస్టిక్‌ క్యారీ బ్యాగ్‌ల వాడకం యథేచ్ఛగా కొనసాగుతోంది. గతంలో న్యాయస్థానం, జీహెచ్‌ఎంసీలు ప్రజారోగ్యానికి హాని కలిగించే ప్లాస్టిక్‌ క్యారీ బ్యాగ్‌లను అరికట్టాలని ఉత్తర్వులు జారీ చేసినా నగరంలో ఏ మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. మలక్‌పేట్, సరూర్‌నగర్, సంతోష్‌నగర్‌ సర్కిళ్ళ పరిధిలో

ప్లాస్టిక్‌ నిషేధంపై ఇప్పటి వరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. క్యారీ బ్యాగుల్లో సరుకులను అందజేస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవడంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా వినియోగదారుల పాలిట పెనుశాపంగా మారుతుంది. కిరాణా దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, మటన్, చికెన్‌ షాపులలో ప్లాస్టిక్‌ క్యారీ బ్యాగులను వివిధ రంగులలో విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు.

- సర్కిల్‌ పరిధిలో వాడి పాడేసిన క్యారీ బ్యాగులను రీసైకిల్‌ పేరుతో వాటిని తిరిగి వివిధ రంగులలో మార్కెట్లో వదులుతున్నారు. ప్లాస్టిక్‌ క్యారీ బ్యాగులు అతి ప్రమాదకరం అని తెలిసినా హోటళ్లు, రెస్టారెంట్లు ఆహార పదార్థాలను క్యారీ బ్యాగుల్లోనే ప్యాక్‌ చేసి ఇస్తున్నారు. ఆ ఆహారం తినడం వల్ల కేన్సర్‌ వచ్చే ప్రమాదం అధికంగా ఉందని ప్రముఖ వైద్యులు హెచ్చరిస్తున్నా ప్రజల్లో మార్పు రావడం లేదు. దుకాణాలు, మాల్స్‌లలో వస్తువులను తీసుకెళ్లిన తరువాత ప్లాస్టిక్‌ క్యారీ



ప్రధాన రహదారులపై పేరుకుపోయిన ప్లాస్టిక్‌కవర్లు

బ్యాగ్‌లను రోడ్లమీద, మురికి కాలువల్లో, చెరువులు, ఖాళీ స్థలాలు, -ప్రధాన రహదారులవెంట వేయడం వల్ల పర్యావరణానికి పెన్నుముప్పుగా మారుతుందని స్వచ్ఛంద సంస్థలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ప్లాస్టిక్‌ క్యారీ బ్యాగులు నాలాలలో చిక్కడం వల్ల వర్షాకాలంలో డ్రైన్లు పొంగి కాలనీలలోకి నీరు చేరుతుంది. ఒక ప్లాస్టిక్‌ క్యారీ బ్యాగు భూమిలో కలవాలంటే లక్షల సంవత్సరాలు పడుతుంది. అవి భూమిలో చేరడం వల్ల భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయి.

- వర్షాకాలంలో ప్లాస్టిక్‌ క్యారీ బ్యాగులు కాలువల ద్వారా చెరువులు, కుంటలలో చేరి చేపల మనుగడను దెబ్బతీస్తున్నాయి. నగరంలో ప్లాస్టిక్‌ క్యారీ బ్యాగులను పారిశుద్ధ్య సిబ్బంది ఎక్కడ పడితే అక్కడ వేసి కాల్చడం వల్ల క్యారీ బ్యాగులు కాలిపోయి డయాక్సిన్‌ ఇతర విష వాయువులు గాలిలో కలసి వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. దీనివల్ల ప్రజలు అనారోగ్యాల బారినపడే అవకాశాలు అత్యధికంగా ఉన్నాయి. ప్లాస్టిక్‌ క్యారీ బ్యాగులు వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలు ప్రజలు గుర్తించకపోవడంతో క్యారీ బ్యాగుల వాడకం నగరంలో రోజురోజుకూ పెరుగుతుందే తప్ప తరగం లేదు. ప్రజల్లో దీనిపై సరైన అవగాహన లేకపోవడం, అధికారుల నిర్లక్ష్యం వల్ల క్యారీ బ్యాగులకు అడ్డుకట్ట పడడం లేదు. ఇప్పటికైనా అధికారులు నగరంలో ప్లాస్టిక్‌ క్యారీ బ్యాగుల వాడకాన్ని నిషేధించి వాటివల్ల భవిష్యత్తులో జరిగే పరిణామాలను నివారించాలని పలువురు పర్యావరణ నిపుణులు, స్వచ్ఛంద సంస్థలు కోరుతున్నాయి.

సీఎం రిలీఫ్‌ ఫండ్‌ పేదలకు వరం : సుధీర్‌రెడ్డి



సీఎం రిలీఫ్‌ ఫండ్‌ ఎల్‌ఓసీని బాధిత కుటుంబ సభ్యులకు అందచేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట: సీఎం రిలీఫ్‌ ఫండ్‌ పేదలకు వరం లాంటిదని ఎల్‌బినగర్‌ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్‌ బైరామల్‌గూడకు చెందిన ఇమ్మిడి ప్రమీల గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా ఆమె బంధువులు పలు ప్రైవేటు ఆసుపత్రిలలో వైద్య పరీక్షలు చేయించగా శస్త్ర చికిత్స తప్పనిసరి అని వైద్యులు నిర్ధారించారు. రెక్కాడితే కాని పూటగడవని ఆమె కుటుంబ సభ్యుల దీనావస్థను తెలుసుకున్న ఎల్‌బీనగర్‌ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సీఎం రిలీఫ్‌ ఫండ్‌కు దరఖాస్తు చేయించారు. గురువారం బాధితురాలి వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరు అయిన లక్ష రూపాయల ఎల్‌ఓసీని అందశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలు అనారోగ్య సమయంలో సీఎం రిలీఫ్‌ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బాధితురాలు భర్త శ్రీశైలం యాదయ్య, నాయకులు చీర శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో సమస్యలను పరిష్కరించుకుందాం



సమావేశానికి హాజరైన పాస్టర్లు, క్రైస్తవ సంఘాల నాయకులు

మలక్‌పేట: సమాజంలో క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఐక్యతతో ముందుకు సాగాలని పాస్టర్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు ఎర్రోల్ల మాణిక్యం అబ్రహం కోరారు. మూసారంబాగ్‌ ఆది అపోస్తులుల ప్రేయర్‌ మినిస్ట్రీస్‌లో గురువారం మలక్‌పేట నియోజకవర్గ పాస్టర్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ జనరల్‌ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రైస్తవ సమస్యల పరిష్కారం కోసం కలసికట్టుగా కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు సంతు, కోశాధికారి శ్రీధర్‌రాజ్, చర్చిల పాస్టర్లు, పెద్దలు, క్రైస్తవ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

12 నుంచి రాక్‌ చర్చిలో యూత్‌ కాన్ఫరెన్స్‌

అస్మాన్‌ఘడ్‌ రాక్‌ చర్చిలో ఈనెల 12 నుంచి 14 తేదీ వరకు యూత్‌ కాన్ఫరెన్స్‌ జరుగుతుందని, నగరంలోని యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అసోసియేషన్‌ అధ్యక్షుడు అబ్రహం మాణిక్యం కోరారు. మన్నా గ్రూప్‌ ఆఫ్‌ మినిస్ట్రీస్‌ చైర్మన్‌ బిషప్‌ సుదర్శన్‌ జ్యోతి కొమ్మనపల్లి, రాక్‌ చర్చి మినిస్ట్రీస్‌ అధ్యక్షుడు రెవరెండ్‌ డాక్టర్‌ పి. దీవెనకుమార్, అంతర్జాతీయ ఆరాధన నాయకులు రెవరెండ్‌ ఎం. యేసుపాల్, రాక్‌చర్చి సీనియర్‌ పాస్టర్‌ బిషప్‌ తిమోతి కొల్లబత్తుల, అసోసియేట్‌ పాస్టర్‌ రెవరెండ్‌ కె. జాన్‌ శామ్యూల్‌ హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. ఉదయం 9 నుంచి 5 సాయంత్రం గంటల వరకు కాన్ఫరెన్స్‌ కొనసాగుతుందన్నారు.

పేదల సంక్షేమానికి కాంగ్రెస్‌ ప్రభుత్వం కృషి

దిల్‌సుఖ్‌నగర్‌: పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్‌ ప్రభుత్వం పనిచేస్తుందని కాంగ్రెస్‌ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం బాధ్యుడు, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గం, ఆర్‌కేపురం డివిజన్‌ పరిధిలోని పలు కాలనీలల్లో శ్రీరామకృష్ణపురం కాలనీ, హరిపురి కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పలు సమస్యలను దృష్టికి తీసుకువచ్చారు. దీనికి సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్‌ నాయకులు చిలుక ఉపేందర్‌ రెడ్డి, పున్న గణేష్‌ నేత, బండి మధుసూధన్‌ రావు, సురేంద్ర కుమార్, నానవాల జ్ఞానేశ్వర్‌ యాదవ్, పెద్దవూర సైదులు, బొడ్డుపల్లి మహేందర్, వంగాల శ్రీకాంత్‌ రెడ్డి కాలనీల సంక్షేమ సంఘం, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు



ఆర్‌కేపురంలో సమస్యలు తెలుసుకుంటున్న కేఎల్‌ఆర్, దేప భాస్కర్‌రెడ్డి తదితరులు

సంస్థను బలోపేతం చేద్దాం

చాదర్‌ఘాట్‌: రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థను బలోపేతం చేయడానికి వికలాంగుల సంఘాలు సహాయ, సహకారాలు అందించి సంస్థకు గుర్తింపు తేవాలని రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్‌ ముత్తినేని వీరయ్య సంఘాలకు విజ్ఞప్తి చేశారు. గురువారం మలక్‌పేటలోని తన కార్యాలయంలో ఫెడ్‌ సంస్థ సభ్యులు గంగారామ్, చెరుకు నాగభూషణం ఆధ్వర్యంలో చైర్మన్‌ను కలసి శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్‌ వీరయ్య వారిని ఉద్దేశించి మాట్లాడుతూ అందరం కలసికట్టుగా ఉండి సంస్థకు గుర్తింపు తేవాలని అన్నారు. దివ్యాంగులు సమస్య ఉంటే తన దృష్టికి తేవాలని వెంటనే పరిష్కారానికి ఆదేశాలు ఇవ్వడం జరుగుతుందని అన్నారు.



ఆరోగ్యశాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే అహ్మద్‌ బలాల



మలక్‌పేట: మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్‌ బలాల గురువారం రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ్మను సచివాలయం లో కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని మలక్‌పేట ఆసుపత్రి, యూపీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాల అ భివృద్ధిపై మంత్రితో చర్చించారు. మలక్‌పేట ఏరియా ఆసుపత్రిలో మెడికల్‌ ఆఫీసర్ల పోస్టింగ్, ఔషధాల సరఫరా, బస్తీ దవాఖానాలు, యూపీహెచ్‌సీలలో పరికరాలు ఏర్పాటు, మెరుగైన వసతులు కల్పించడంపై మంత్రి దృష్టికి తీసుకెళ్లగా మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

అభినందనలు



మన్సూరాబాద్‌: తెలంగాణ రాష్ట్ర బీసీ కో ఆపరేటీవ్‌ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన నూతి శ్రీకాంత్‌ను యూత్‌ కాంగ్రెస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కిడి శివచరణ్‌రెడ్డి గురువారం కలసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు.

హత్తిగూడ చెరువును కాపాడాలి

మన్సూరాబాద్‌ డివిజన్‌ పరిధిలోని హత్తిగూడ చెరువు కబ్జాకు గురవుతుందని, కబ్జాదారులపై చర్యలు చేపట్టి చెరువును కాపాడాలని మన్సూరాబాద్‌ కార్పొరేటర్‌ కొప్పుల నర్సింహారెడ్డి డిమాండ్‌ చేశారు. హత్తిగూడ చెరువు కబ్జాకు గురవుతుందని కార్పొరేటర్‌ కొప్పుల నర్సింహారెడ్డి హయత్‌నగర్‌త మండల రెవెన్యూ, ఇరిగేషన్‌ అధికారులకు ఫిర్యాదు చేయటంతో గురువారం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ మూడు రోజుల క్రితం కాలువలను కబ్జాదారులు పూడ్చివేశారని, గత కొంత కాలంగా కొందరు కబ్జాకు యత్నిస్తున్నారని ఇరిగేషన్‌ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని మండిపడ్డారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కబ్జాదారులను ప్రోత్సహించే విధంగా వ్యవహిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా చట్టపరమైన చర్యలు చేపట్టాలని లేకపోతే సమీప కాలనీవాసులతో కలసి చెరువు ప్రాంతంలో నిరాహారదీక్ష చేపడుతానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్‌ జానకి, ఆర్‌ఐ నర్సింహ, సర్వేయర్లు జ్యోతి, బాలరాజ్, ఇరిగేషన్‌ డీఈ ఉషారాణి, ఎఈ తస్వీన్‌ రజాక్, పెద్ద అంబర్‌పేట మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ చామ సంపూర్ణ విజయ్‌శేఖర్‌రెడ్డి, నాయకులు చామ కృష్ణారెడ్డి, సీపీఐ నేత శేఖర్‌రెడ్డి, సమీపకాలనీలవాసులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్‌ రూ. 6 వేలకు పెంచాలి



ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి వినతి పత్రం అందచేస్తున్న కోర్‌ కమిటీ సభ్యులు

చంపాపేట: కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం అర్హులైన వికలాంగులకు నాలుగు వేల రూపాయల నుంచి నుంచి ఆరువేల రూపాయలకు పెంచాలని వికలాంగుల పోరాట సమితి జాతీయ కోర్‌ కమిటీ కో చైర్మన్‌ అందె రాంబాబు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఆధ్వర్యంలో సమితి కార్యవర్గ సభ్యులతో కలసి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి వినతి పత్రం అందచేశారు. అనంతరం రాంబాబు మాట్లాడుతూ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ప్రకటన మేరకు రాష్ట్రంలోని 119 మంది ఎమ్మెల్యేలకు వికలాంగుల పింఛన్‌ పెంపుదల గురించి వినతి పత్రాలు అందచేయటం జరుగుతుందని స్పష్టం చేశారు. అర్హులైన దివ్యాంగులందరికీ ఆర్‌టీసీ బస్‌లలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించటంతో పాటు వికలాంగుల సంక్షేమ శాఖను స్వతంత్రంగా ఉంచే విధంగా జీఓ నెం 33ను తక్షణమే అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో వికాంగుల సమస్యలపై చర్చ జరిగేలా తానుప్రయత్నిస్తానని సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సమితి జాతీయ కోర్‌ కమిటీ చైర్మన్‌ గోపాల్‌రావు, సభ్యులు జంగయ్య, చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలకు వ్యతిరేకంగా ఆటో డ్రైవర్ల నిరసన



కొత్తపేట చౌరస్తాలో నిరసన తెలియజేస్తున్న ఆటో కార్మికులు

చైతన్యపురి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కొత్త చట్టాలను తీసుకొచ్చి ఆటో డ్రైవర్లను ఇబ్బందులకు గురిచేస్తుందని ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్‌ ఫెడరేషన్, రంగారెడ్డి జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు కదారి రాములు, సరూర్‌నగర్‌ సీఐటీయూ కన్వీనర్‌ మల్లెపాక వీరయ్య ఆరోపించారు. గురువారం కొత్తపేట చౌరస్తాలోని ఆటో స్టాండ్‌ వద్ద ఆటో డ్రైవర్లు కొత్త చట్టాలపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కొత్త చట్టాలను అమలుల్లోకి తీసుకొచ్చి ఆటో డ్రైవర్లను ప్రమాదాలకు బాధ్యులను చేయరాదన్నారు. ప్రమాదాలకు కారణాలు తెలుసుకొని డ్రైవర్ల తప్పు ఉంటనే శిక్షించాలన్నారు. అసలే రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పథకంతో కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతుంటే మళ్లీ కొత్త చట్టాల వల్ల మరింత ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉచిత బస్‌ పథకం వల్ల ఆటో నడుపుతూ జీవనం గడుపుతున్న డ్రైవర్లు నష్టపోతున్నారని, ప్రభుత్వం ఆటో కార్మికులను ఆదుకోవాలి డి మాండ్‌ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఆటో కార్మికులకు నెలకు రూ.12 వేలు అందజేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని ఆయన కోరారు. అదే విధంగా ఇన్సూరెన్స్‌ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, పలువురు ఆటో కార్మికులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు



జనప్రియ కాలనీవాసులతో మాట్లాడుతున్న ఏసీపీ కృష్ణయ్య, కార్పొరేటర్‌ రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్‌ ఏసీపీ కృష్ణయ్య హెచ్చరించారు. లింగోజిగూడ డివిజన్‌ పరిధిలోని జనప్రియ అపార్ట్‌మెంట్ల వద్ద రాత్రి సమయంలో ఆకతాయిలు మద్యం తాగటంతోపాటు గంజాయి సేవిస్తున్నారని స్థానికులు కార్పొరేటర్‌ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బుధవారం రాత్రి ఏసీపీ కృష్ణయ్య ఆధ్వర్యంలో సరూర్‌నగర్‌ పోలీసులు, కార్పొరేటర్‌తో కలసి కాలనీలో పర్యటించి స్థానికులు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి సంఘటన జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎవరైనా ఇతరులకు ఇబ్బందులకు కలగజేసే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

మలక్‌పేట: అంతర్గత రోడ్లను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని మూసారంబాగ్‌ కార్పొరేటర్‌ బి. భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. డివిజన్‌ పరిధిలోని గడ్డిఅన్నారం బస్తీ, రామాలయం బస్తీలలో రూ.34 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులు గురువారం కార్పొరేటర్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోనాల పండుగ ఉన్న నేపథ్యంలో సీసీరోడ్డు పనులు సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అమ్మవారి ఆలయాల పరిసరాలలో పేరుకుపోయిన మట్టికుప్పలు, వ్యర్థాలు తొలగింపు చేయించి శుభ్రం చేయించారు. మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నా యకులు మల్లారెడ్డి, సురేందర్, ప్రభాకర్, జీవన్, అమిత్, కిరణ్, ఉమేష్, జీహెచ్‌ఎంసీ ఏఈ రవి కాంత్, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ సత్తిరెడ్డి పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ భాగ్యలక్ష్మి

బోనాలకు ప్రత్యేక ఏర్పాట్లు



రోడ్లపై చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

లింగోజిగూడ: ఆషాఢ మాస బోనాల సందర్భంగా డివిజన్‌లో దేవాలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని కాంగ్రెస్‌ పార్టీ జీహెచ్‌ఎంసీ ఫ్లోర్‌ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్‌ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. బోనల సందర్భంగా పలు కాలనీలలో గురువారం ఎల్‌బీనగర్‌ సర్కిల్‌ డీసీ జాకీయ సుల్తానతో కలసి రాజశేఖర్‌రెడ్డి పర్యటించి రోడ్లపై ఉన్న చెత్తను వెంటనే తొలగించే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను రోడ్లపై వెయ్యకుండా స్వచ్ఛ ఆటోలలోనే వేయాలని, తడి, పొడి చెత్తను వేరు చేసి వేయాలని ఆయన సూచించా రు. అందరి సహకారంతో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపరిచి డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని, అభివృద్ధిలో ముందుంచుదామని తెలిపారు. అధికారులు, సిబ్బంది కూడా రోడ్లపై ఎక్కడ కూడా చెత్త వేయకుండా చర్యలు తీపుకోవాలని, దేవాలయాల వద్ద సిబ్బందిని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు చెత్తను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్‌ డీఈ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు చిక్కకుండా దొంగ తెలివి..!

దొంగతనం చేసిన ఇంట్లో వేరే సెల్‌ఫోన్‌ వదిలేసిన దొంగలు

నాగోలు: దొంగతనాలు చేసిన తరువాత పోలీసులను దారి మళ్లించేందుకు దొంగలు కొత్తకొత్త దారులు వెతుకుతున్నారు. ఈ కోవలోనే నాగోల్‌లో దొంగలు ఓ ఇంట్లో దొంగతనం చేసిన తరువాత పోలీసులను పక్కదారి పట్టించేందుకు అక్కడ మరొక చోట దొంగతనం చేసిన సిమ్‌కార్డు లేని సెల్‌ఫోన్‌ వదిలిపెట్టి వెళ్లారు. సంఘటన వివరాల ప్రకారం... నాగోలులోని తట్టి అన్నారం వైఎస్‌ఆర్‌ కాలనీలోని సుదర్శన్‌ ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సుదర్శన్‌ ఇంటిని పరిశీలించగా ఇంట్లో సిమ్‌ కార్డు లేని ఓ సెల్‌ఫోన్‌ దొరికింది ఆ సెల్‌ఫోన్‌ దొంగలది అనే అనుమానంతో పోలీసులు విచారణ చేయగా ఆ సెల్‌ఫోన్‌ సోలాపూర్‌లో ఉన్న తట్టి అన్నారంలోని వైఎస్‌ఆర్‌ కాలనీకి చెందిన హర్సలాన్‌ అనే యువకుడిదిగా గుర్తించారు. అతనే దొంగతనం చేసి తన సెల్‌ఫోన్‌ మర్చిపోయి ఉంటాడని భావించి తట్టిఅన్నారంలోని హర్సలాన్‌ కుటుంబ సభ్యులను బుధవారం పోలీస్‌ స్టేషన్‌ తీసుకెళ్ళి విచారించి సోలాపూర్‌లో ఉన్న హర్సలాన్‌ను పిలిపించాలని చెప్పారు. దీంతో గురువారం తెల్లవారుజామున హర్సలాన్‌ తట్టిఅన్నారంలోని తన నివాసానికి చేరుకోగా బయట గేటు తాళం వేసి ఉండగా ఇంటి తాళాలు మాత్రం పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లో ఉన్న సెల్‌ఫోన్‌తో పాటు 4 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి హర్సలాన్‌ డయల్‌ 100తో పాటు పీఎస్‌కు సమాచారం అందించాడు. హర్సలాన్‌ నివాసానికి వచ్చిన పోలీసులు షాక్‌కు గురయ్యారు. సుదర్శన్‌ ఇంట్లో చోరీ చేసిన దుండగులు మొదట హర్సలాన్‌ ఇంట్లో చోరీ చేసినట్లు గుర్తించారు. అదే సమయంలో దొంగిలించిన సెల్‌ఫోన్‌ను పోలీసులను డైవర్ట్‌ చేసేందుకు సుదర్శన్‌ ఇంట్లో చోరీ చేసి అక్కడ సెల్‌ఫోన్‌ వదిలి వెళ్ళినట్లు స్పష్టం అయ్యింది. ఇదిలా ఉండగా దొంగలు ఎత్తుకెళ్లారు అనుకున్న హర్సలాన్‌ ఇంట్లో పోయిన బంగారం వాళ్ళ ఇంట్లోనే బట్టల కింద దొరికింది. ఈ సంఘటనలో సెల్‌ఫోన్‌ మాత్రమే చోరీకి గురైంది.